సాక్షి వనపర్తి

శనివారం । 24 । జూన్ । 2023



.. ప్రారంభమయ్యేనా?

ఎస్‌జీఎఫ్ క్రీడలు ఈసారైనా ప్రారంభమవుతాయా అని క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు.

వివరాలు 10లో ▸



సకాలంలో రైతులకు రుణాలు

రైతులకు సకాలంలో రుణాలు అందిస్తామని డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా అన్నారు.

వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 35.1 /23.6

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం వర్షం పడే అవకాశం ఉంది.

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



వనపర్తి: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రెడ్డితో ఫోన్ ఇన్ నిర్వహిస్తుంది. వర్షాలు ఆలస్యం, సరైన అదను సమయం, ఎరువుల– విత్తనాల సరఫరా, నకిలీ విత్తనాలు తదితర అంశాలపై రైతులు నేరుగా డీఏఓతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ: 24.6.2023 శనివారం
ఉదయం 11 నుంచి
మధ్యాహ్నం 12 వరకు
సంప్రదించాల్సిన సెల్ నంబర్లు


72888 94287, 72888 78436, 95539 55698

న్యూస్‌రీల్

అనాథల హక్కుల సాధనకు పోరాడుతాం

వనపర్తి: అనాథల హక్కుల కోసం ఎంత వరకైనా పోరాడుతామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కార్తీక్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అనాథల హక్కుల సాధన కోసం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలో అనాథల కోసం హాస్టల్ ఏర్పాటు చేస్తామని 2016లో మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. అనాథ పిల్లలకు ఓట్లు లేవన్న ఉద్దేశంతో వారి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనాథ గురుకులాల ఏర్పాటు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కొమ్ము చెన్నకేశవులు, మంద నర్సింహ, గంధం లక్ష్మయ్య, గట్టు స్వామి, ఎడవల్లి భాస్కర్, మీసాల నాగరాజు, దేవని రమేష్, ఎమ్మార్పీఎస్ మొల్కలపల్లి పరశురాముడు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో మెరిసిన విద్యార్థిని




వనపర్తి: హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 21 వరకు తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన సాక్షిరెడ్డి చక్కటి ప్రతిభ కనబర్చారు. జూనియర్ కేటగిరీలో వెండి పతకం సాధించింది. శుక్రవారం విజేతకు బహుమతి ఐపీఎస్ అధికారి తరుణ్‌జోషి పతకం అందజేసి అభినందించారు.

26న జాబ్‌మేళా

వనపర్తి: స్థానిక రామాలయం సమీపంలోని పీఎంకేకే కార్యాలయంలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎండి జానీపాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని.. పది, ఇంటర్, ఆపై విద్యార్హత గల అభ్యర్థులు ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు ప్రతులతో హాజరుకావాలని పేర్కొన్నారు. వేతనం రూ.12,500 నుంచి రూ.18 వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రతి నీటిబొట్టు భూమిలోకి ఇంకాలి



అమరచింత: వర్షాకాలంలో కురిసిన ప్రతి నీటి చుక్క భూమిలోకి చేరాలని.. ప్రతి ఇంటా ఇంకుడుగుంత నిర్మించుకోవాలని డీపీఓ సురేష్ కుమార్ కోరారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నాగల్‌కడ్మూర్, నందిమళ్ల, కిష్టంపల్లిలో పర్యటించి రహదారి వెంట నాటిన మొక్కలకు నీరందించారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ఆలయ పరిసరాల్లో మురుగు నిల్వకుండా, వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. తడి, పొడి చెత్తను రోజు సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేసి వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు. ఆయనవెంట ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు, ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం.. ప్రశ్నార్థకం

జూరాల ప్రాజెక్టు వద్ద నిల్వనీడ కరువు



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వా విభాగంలో పర్యాటకులు (ఫైల్)

- గుర్తింపునకు నోచుకోని చంద్రగఢ్ కోట
- సందర్శకులు, పర్యాటకులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు

అమరచింత: ఉమ్మడి జిల్లాకే తలమానికమైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగం ఏళ్ల తరబడి పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కృష్ణా పుష్కరాల సమయంలో పుష్కర ఘాట్లను నాసిరకంగా నిర్మించడంతో వరద ప్రవాహానికి కొట్టుకుపోయి బండరాళ్లు తేలాయి. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులు కాసేపు సేద తీరడానికి వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లా బహుళార్థక ప్రాజెక్టుగా జూరాలకు గుర్తింపు ఉన్నా.. పర్యాటకంలో మాత్రం వెనుకబడింది. ప్రాజెక్టు రహదారిలో అమరచింత మండలంలో ఉన్న చారిత్రక కట్టడం చంద్రగఢ్ కోటను సైతం పాలకులు విస్మరించారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



చంద్రగఢ్ కోట

ఎడారిలా ఎడమ కాల్వ విభాగం..

ఆయకట్టుతో పాటు దిగువ ప్రాజెక్టు పరిధిలో విశాలమైన ప్రదేశం ఉండటంతో డ్యాం సందర్శనకు పర్యాటకులు అధికంగా ఇక్కడికే వస్తుంటారు. ఈ ప్రాంతమంతా ఎడారిని తలపిస్తుండటంతో పర్యాటకులు పిల్లపాపలతో కాసేపు సేద తీరడానికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇక్కడే రుచికరమైన చేప వంటకాలు లభిస్తుండటం అత్యధికంగా ప్రజలు, సందర్శకులు వస్తున్నా వసతులు లేక నిరాశకు గురవుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..

జూరాల ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు వద్ద బొటానికల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– కడియాల నర్సింహులు, అమరచింత

కోటను గుర్తించాలి..



చారిత్రక చంద్రగఢ్ కోటను ప్రభుత్వం గుర్తించి పర్యాటకంగా అభివృద్ధిపర్చాలి. ప్రస్తుతం గ్రామపంచాయతీ నిధులు, అధికారుల చొరవతో కోట పరిసరాల్లో మెగా ప్రకృతివనాన్ని ఏర్పాటు చేయిస్తున్నాం. చారిత్రక కట్టడాలు సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్, చంద్రగఢ్

ప్రతిపాదనలు పంపాం..



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వావిభాగంలో గ్రీనరీని విస్తరించాలని ఇక్కడ పార్కులను అభివృద్ధి పర్చాలని ఉన్నాతాధికారులకు గతంలో నివేదికలను పంపాం. ఎడమ కాల్వ పరిధిలోని ప్రాజెక్టు స్థలంలో హరితహరం ద్వార మొక్కలను పెంచుతున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో నది తీరం వెంట వనమాల ద్వార మొక్కలను నాటుతున్నారు. ఇక్కడి ప్రదేశాలలో పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేవిదంగా ప్రతిపాదనలు మారోమారు పంపుతున్నాము.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ డ్యాం డివిజన్

చారిత్రక చంద్రగఢ్ కోట..

జూరాల ప్రాజెక్టుకు వెళ్లే రహదారిలో పురాతన చంద్రగఢ్ కోట ఉంది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. గుప్తుల కాలంలో చంద్రగుప్తుడు తన రాజ్య విస్తరణతో పాటు పరిపాలన రక్షణ కోసం కృష్ణానది సమీపంలో భార్య చంద్రమతి పేరుతో ఇక్కడ కోట నిర్మించారు. శత్రువులను దూరం నుంచి పసిగట్టి మట్టుబెట్టేందుకు కోట పైభాగం నుంచే ఫిరంగులు పేల్చేలా నిర్మాణం చేపట్టారు. ఆధ్యాత్మికత కోసం శివాలయం, కోటపై భాగాన రాతి కోనేరు ఉండటం.. మండు వేసవిలో కూడా కోనేరులా నీరు ఉండటం ఇక్కడి విశేషం. అధికారులు, పాలకులు ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కోట గోడలు, నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయి.

త్వరలో ప్రొ. జయశంకర్ కాంస్య విగ్రహం ఏర్పాటు



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య జయశంకర్ కాంస్య విగ్రహాన్ని నాగవరం పార్క్‌లో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం రాత్రి జిల్లాకేంద్రంలోని బ్రహ్మంగారి వీధిలో నిర్వహించిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వనపర్తి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. పట్టణ ప్రజల సహకారంతో సాధ్యమైందన్నారు. జిల్లాకేంద్రంతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాలకు తాగు నీరు అందించేందుకు రూ.400 కోట్లతో చేపట్టిన ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం పనులు పూర్తికావస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్, నాయకులు అంజిరెడ్డి, గోపీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

వనపర్తికి చేరుకున్న జీపుజాతా

వనపర్తిటౌన్: జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి కోరారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జీపుజాతా శుక్రవారం వనపర్తికి చేరుకుంది. జిల్లాకేంద్రంలోని ధర్నా చౌక్‌లో నిర్వహించిన సభలో పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 45వ సమావేశం తీర్మానం మేరకు అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను రద్దు చేసి, డిగ్రీలు చదివిన ఇంగ్లీష్ మీడియం వారిని టీచర్లుగా తీసుకొని, పాతవారి కడుపు కొట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు, భవనాల అద్దెలు పట్టణానికి రూ.6 వేలు, గ్రామానికి రూ.2 వేల చొప్పున చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, చివరి జీవితంలో సగం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు నిక్సన్, రాములు, మద్దిలేటి, యూనియన్ ఉపాధ్యక్షురాలు కవిత, కార్యదర్శి నారాయణమ్మ, సభ్యులు జ్యోతి, సుమతి, వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, రాధా, శాంతాబాయి, అలివేల, విజయలక్ష్మి పాల్గొన్నారు.



కామ్రేడ్ జయలక్ష్మికి స్వాగతం పలుకుతున్న పుట్టా ఆంజనేయులు, ఉపాధ్యాయులు

ఉచిత న్యాయసేవల రక్షణ కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు

వనపర్తి: స్థానిక కోర్టుల సముదాయంలో శుక్రవారం ఉచిత న్యాయసేవల రక్షణ కార్యాలయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల ఈ కార్యాలయాలు ప్రారంభించామని, శుక్రవారం మరో 16 ప్రాంతాల్లో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో ఆయనతో పాటు న్యాయమూర్తి నవీన్‌రావు మాట్లాడి న్యాయసేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత, సీనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి రజిని, జూనియర్ న్యాయమూర్తులు జానకి, రవికుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్‌కుమార్ యాదవ్, ప్రధానకార్యదర్శి బాలనాగయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు వనపర్తి



కాగడాతో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ తదితరులు

జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: దశాబ్దాలుగా వనపర్తి ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతోందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఒలంపిక్ డేను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో కలిసి కాగడా వెలిగించి ఒలంపిక్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి ప్రోత్సాహంతో ఈ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. యువతను ప్రోత్సహిస్తూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటేందుకు తనవంతు కృషి చేస్తున్నారని పీడీలు, పీఈటీల పనితీరు, సీనియర్ క్రీడాకారులను ప్రశంసించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, ఒలంపిక్ కన్వీనర్ కుమార్, పీడీ సురేందర్‌రెడ్డి, పీఈటీలు తిరుపతి, శ్రీకాంత్, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంమహేశ్వర్‌రెడ్డి

వనపర్తి: బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామని జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంమహేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక సఖి కేంద్రంలో సీడబ్ల్యూసీ, డీసీపీఓ, సఖి, చైల్డ్‌లైన్, ఆర్డీఎస్ తదితర సంస్థలతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాలల అక్రమ రవాణా, శ్రమదోపిడి, వేధింపుల నియంత్రణకు శ్రీకారం చుట్టాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులని.. చిన్నారులను గుర్తించి ప్రయోజకులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

నిర్లక్ష్యమే శాపమై..

పాలమూరు వైద్య కళాశాలపై జాతీయ మెడికల్ కౌన్సిల్ పిడుగు

- 2018 విద్యా సంవత్సరం బ్యాచ్ గుర్తింపు రద్దు
- ఫ్యాకల్టీ కొరత, సీసీ కెమెరాల ఏర్పాటు, బయోమెట్రిక్ సక్రమంగా లేవని నివేదిక
- మరో మూడు గుర్తింపులు వస్తేనే విద్యార్థులకు భవిష్యత్
- ప్రస్తుతం హౌస్ సర్జన్‌లుగా పనిచేస్తున్న బ్యాచ్ విద్యార్థులు



పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాల

పాలమూరు: పాలమూరు మెడికల్ కళాశాలకు సంబంధించి 2018 విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ గుర్తింపును జాతీయ మెడికల్ కౌన్సిల్ రద్దు చేసింది. అయితే గుర్తింపు రద్దు చేయడంపై కళాశాల అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యమైన పనితీరు బయటపడింది. ఎన్ఎంసీ బృందం ఇచ్చిన నివేదిక ద్వారా హెచ్చరించిన అధికారుల పనితీరులో మార్పు రాకపోవడంతో చివరికి గుర్తింపు కోల్పోవాల్సి వచ్చింది. ఒకవేళ బ్యాచ్ చివరివరకు గుర్తింపు ఇవ్వకపోతే సదరు విద్యార్థులు భవిష్యత్ నష్టపోవాల్సి వస్తుంది. అయితే సరైన వసతులు కల్పించి తిరిగి మళ్లీ కౌన్సిల్ దగ్గర అప్పీల్ చేసుకోవాలని ఓ అవకాశం కల్పించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓ విద్యా సంవత్సరం బ్యాచ్ అనుమతి రద్దు చేయడం ఇదే మొదటిసారి.

2016లో ఏర్పాటు..

పాలమూరు మెడికల్ కళాశాలను 2016 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. 2016తో పాటు 2017 విద్యా సంవత్సరానికి జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు ఇచ్చింది. 2018 విద్యా సంవత్సరంలో కళాశాలలో 150 మంది మెడికోలు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ క్రమంలో అదే ఏడాదికి సంబంధించి జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు కోసం ఈ ఏడాదిలో రెండుసార్లు కళాశాలను బృందం పరిశీలించింది. ఆ సమయంలో కళాశాలతో పాటు జనరల్ ఆస్పత్రిలో ఉన్న వసతులు, సౌకర్యాలపై జాతీయ మెడికల్ కౌన్సిల్ ఒక నివేదిక తయారు చేసింది. ఇందులో కావాల్సిన రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో పాటు కళాశాలలో సదుపాయాలు, బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని కారణాలు చూపుతూ తాజాగా అనుమతి రద్దు చేశారు.

రెండుసార్లు సందర్శన..

ఈ ఏడాది ఫిబ్రవరి 27న జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం మెడికల్ కళాశాలను చివరగా సందర్శించారు. ఆ తర్వాత జూన్ 13న వర్చువల్ ఇయరింగ్ ఇచ్చారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం కళాశాలలో 212 మంది బోధన అధ్యాపకులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 181 మంది ఉన్నారు. ఇందులో 76 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ, 95 మంది కాంట్రాక్ట్, మరో పదిమంది సీఎఎస్‌లు ఉన్నారు. దీంతో పాటు కళాశాలలో 13 సీసీ కెమెరాలు, జనరల్ ఆస్పత్రిలో 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎన్ఎంసీ పోర్టల్‌కు అనుసంధానం చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. దీనికితోడు అటెండెన్స్, బయోమెట్రిక్ విధానం సక్రమంగా పని చేయకపోవడం, ఇతర సౌకర్యాలు సక్రమంగా లేవని జాతీయ మెడికల్ కౌన్సిల్ కారణాలు చూపుతూ 2018 బ్యాచ్ గుర్తింపును రద్దు చేశారు. సదరు బ్యాచ్ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం హౌస్ సర్జన్లుగా పనిచేస్తుండగా.. వీరి హౌస్ సర్జన్ సమయం వచ్చే ఏడాది పూర్తి కానుంది.

మరో మూడుసార్లు వస్తేనే..

రెగ్యులర్ ఫ్యాకల్టీ కొరత వల్ల చాలా వరకు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే పాలమూరు మెడికల్ కళాశాలకు జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు రాగా మరో మూడుసార్లు రావాల్సి ఉంది. ఐదుసార్లు ఎన్ఎంసీ గుర్తింపు వచ్చిన తర్వాత అలాంటి కళాశాలలో చదివిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా సర్టిఫికెట్‌కు గుర్తింపు లభిస్తుంది.

981 పోస్టులు మంజూరు

పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016–17 ఏడాదిలో 150 సీట్లతో మొదలుపెట్టారు. కళాశాలకు మొత్తం 981 పోస్టులు మంజూరు చేయగా ఇందులో బోధన సిబ్బంది పోస్టులు 212 ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, కాంట్రాక్టు కలిపి 181 బోధన సిబ్బంది ఉండగా మరో 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొదట్లో 150 సీట్లతో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 25 సీట్లు పెరగడంతో మొత్తం 175 సీట్లకు చేరింది.

మెడికల్ కళాశాలలో బోధన అధ్యాపకుల వివరాలు

ప్రొఫెసర్లు 17	అసోసియేట్ ప్రొఫెసర్లు 14
అసిస్టెంట్ ప్రొఫెసర్లు 67	ట్యూటర్లు 18
ఎస్ఆర్ 32	జేఆర్ 23
సీఏఎస్ 10	

● విద్యార్థులు



అప్పీల్ చేశాం..

జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇచ్చిన డిస్ అప్రూవల్ లెటర్ కేవలం ఆధార్ బయోమెట్రిక్, కళాశాల, ఆస్పత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన విషయమే. ఇప్పటికే ఆధార్ బయోమెట్రిక్‌తో పాటు కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ఎన్ఎంసీ పోర్టల్‌కు అనుసంధానం చేశాం. వారం రోజుల్లో జనరల్ ఆస్పత్రిలోని కెమెరాలను ఎన్ఎంసీ పోర్టల్‌కు అనుసంధానం చేస్తాం. దీనిపై ఇప్పటికే జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు ఇచ్చిన అప్పీల్‌లో పేర్కొన్నాం. దీనిపై కౌన్సిల్ సానుకూలంగా స్పందించి 2018 హౌస్ సర్జన్ బ్యాచ్‌కు గుర్తింపు ఇస్తారు. ఈ ఏడాది మే నుంచి 2018 బ్యాచ్ వారు హౌస్ సర్జన్లుగా 2024 ఏప్రిల్ వరకు పనిచేస్తారు. అప్పటిలోగా కళాశాల నుంచి వెళ్లిన అప్పీల్‌కు జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు ఇస్తుంది. 2023– 24 ఎంబీబీఎస్ ప్రవేశాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఎంసీసీ పోర్టల్‌లో సీట్లను అప్‌లోడ్ చేయడం జరిగింది.

– డాక్టర్ రమేష్, మెడికల్ కళాశాల డైరెక్టర్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


పుల్లయ్య (ఫైల్)

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌కు చెందిన రైతు కాలె పుల్లయ్య (58) విద్యుదాఘాతానికి గురై శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్సిరెడ్డి పొలాన్ని అదే గ్రామానికి చెందిన రాములయ్య కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పక్క పొలం కావడంతో బోరుమోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు పుల్లయ్యను కౌలు రైతు రాములయ్య సాయం కోరాడు. విద్యుత్ తీగలను ఇనుప నిచ్చెన సాయంతో పుల్లయ్య పైన బిగిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. గమనించిన తోటి రైతులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. పుల్లయ్యకు భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోయిల్‌సాగర్‌లో పడి..


మహ్మద్ జిషన్ అబ్‌రార్ (ఫైల్)

దేవరకద్ర: కోయిల్ సాగర్ ప్రాజెక్టులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ జిషన్ అబ్‌రార్ (45) కొంత కాలంగా మానసిక ఆనారోగ్యంతో బాధపడే వాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా శుక్రవారం ఉదయం కోయిల్‌సాగర్‌లో అతని మృతదేహం బయట పడింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

వనపర్తి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. చందాపూర్‌కి చెందిన రంగారెడ్డి (40) గురువారం సాయంత్రం మద్యం సేవించి భార్యతో గొడవపడి వ్యవసాయపొలంలో ఉపయోగించేందుకు తీసుకువచ్చిన గడ్డిమందును తాగాడు. దీంతో వెంటనే ఆయనను భార్య సంధ్య, బావమరిది రాఘవరెడ్డి వనపర్తిలోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోస్గి: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులల కథనం మేరకు మండల పరిధిలోని హన్మాన్‌పల్లికి చెందిన సద్దాం హుస్సేన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబసభ్యుల మధ్య ఆర్థిక సంబంధ విషయమై తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి మరోసారి కుటుంబసభ్యుల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన సద్దాం హుస్సేన్ శుక్రవారం వ్యవసాయ పొలానికి వెళ్లి గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించే సరికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని వెంటనే కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఈ ఏడాదైనా ప్రారంభమయ్యేనా?


జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీ (ఫైల్)

- కరోనా వల్ల మూడేళ్లుగా జరగని ఎస్‌జీఎఫ్ క్రీడలు
- ఆటలకు దూరమవుతున్న కళాశాల, పాఠశాలస్థాయి విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాఠశాల, కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటిన చాలా మంది ఉమ్మడి జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించారు. ప్రతి ఏడాది పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జిల్లాస్థాయిలో ఎంపికలు, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తారు. ఈ క్రీడలపై కరోనా మహమ్మారి తీవ్ర ప్రభావం చూపింది. మూడేళ్లుగా క్రీడా సెలక్షన్స్, టోర్నీలు నిర్వహించలేదు. 2020లో జిల్లాకు కేటాయించిన జాతీయస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ టోర్నీ, అండర్–17, అండర్–19 టెన్నికాయిట్ టోర్నీలు కూడా కోవిడ్ వల్ల రద్దు అయ్యాయి. 2020 మార్చి నుంచి ఇప్పటివరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు జరగలేదు.

ఎస్‌జీఎఫ్‌కు వేధిస్తున్న నిధుల కొరత

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. క్రీడల నిర్వహణకు అరకొర బడ్జెట్ కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీలు నిర్వహించాలంటే ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో టోర్నీల నిర్వహణకు చాలా మంది కార్యనిర్వాహక కార్యదర్శులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా.. కళాశాల, పాఠశాల స్థాయిలో స్కూల్ గేమ్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి, అనంతరం ఎస్‌జీఎఫ్ పోటీల సెలక్షన్స్‌పై నిర్ణయం తీసుకుంటారు. ప్రతి ఏడాది జూలై చివరి వరకు మండల, ఆగస్టు, సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి తదనంతరం ఉమ్మడి జిల్లాల క్రీడల ఎంపికలు నిర్వహిస్తారు. ఈ ఏడాదైనా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్ ప్రకటించాలి



మూడేళ్ల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైంది. వెంటనే ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా ఎంపికల షెడ్యూల్ ప్రకటించాలి. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తగిన చర్యలు తీసుకోవాలి.

– దూమర్ల నిరంజన్, టీజీపెటా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మహబూబ్‌నగర్

ఈ ఏడాది ప్రారంభమవుతాయి



ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమవుతాయి. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సమావేశంలో రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీల షెడ్యూల్ ప్రకటిస్తారు. అనంతరం జిల్లాస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తాం. ఆగస్టు మొదటి వారంలో మండల స్థాయి, చివరి వారంలో జిల్లా, జోనల్ లెవల్ ఎంపికలు జరుగుతాయి.

– రమేశ్‌బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

అక్రమంగా శిక్షణ కేంద్రం నిర్వహణ?

- పోలీసుల అదుపులో సంస్థ నిర్వాహకుడు


పోలీసుల అదుపులో నిర్వాహకుడు


శ్రీనివాసకాలనీలోని భవనం

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ఆన్‌లైన్ బిజినెస్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడిని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని శ్రీనివాసాకాలనీలో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకొని ఎలాంటి అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది యువతను చేర్చుకొని ఇండిపెండెంట్ బిజినెస్ కన్సల్‌టెంట్ సెంటర్ (ఐబీసీసీ) పేరుతో రెండు నెలలుగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, నంద్యాల, విజయవాడ, గుంటూరు, కడప, బద్వేల్, పులివెందుల, అనంతపురం తదితర ప్రాంతాలకు చెందిన యువతే ఉండటం, స్థానికులు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ. 8 వేల వరకు వసూలు చేస్తున్నారని, వీరు మరికొందరిని ఇందులో జాయిన్ చేస్తే వారికి కమీషన్ కూడా చెల్లిస్తున్నారని సమాచారం. ఇదేమైనా గొలుసుకట్టు వ్యాపారమా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిర్వాహకుడు మాట్లాడుతూ.. ఐబీసీసీ సంస్థ నిర్వాహకులకు ఆన్‌లైన్ వస్త్ర కంపెనీ అయిన గ్రాబిజ్‌తో అనుబంధం ఉందని, కంపెనీ యాప్‌లో దుస్తులు, బూట్లు, టై, బెల్ట్ తదితర వాటిని బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చని, కొనుగోలు చేసిన వారి నుంచి వచ్చే కమీషన్ సభ్యులకు అందుతాయని చెబుతున్నారు.

త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం..

ఆన్‌లైన్‌లో దుస్తులు, బూట్లు, టై, బెల్ట్‌లు విక్రయించే గ్రాబిజ్ సంస్థతో ఐబీసీసీ నిర్వాహకులకు అనుబంధం ఉండటంతో యువతకు ఆన్‌లైన్ బిజినెస్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది. సంస్థ నిబంధనలు, ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు. ఏ ప్రాంతాల్లో ఇలాంటి సంస్థలు ఉన్నాయి. సంస్థ లక్ష్యం తదితర విషయాలపై విచారణ చేపడతాం. భవనం అద్దెకు ఇచ్చిన యాజమానిని సైతం విచారించి చర్యలు తీసుకుంటాం. గొలుసుకట్టు వ్యాపారం చేస్తున్న పలు సంస్థలు ప్రజలను మోసం చేసిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని పూర్తిస్థాయిలో విచారిస్తాం. ఇలాంటి సంస్థలు ఎక్కడైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– చంద్రశేఖర్ యాదవ్, సీఐ, గద్వాల

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి


కిష్టయ్య (ఫైల్)

కోస్గి: హైదరాబాద్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి భార్యాపిల్లలను చూసుకుంటూ జీవనోపాధి పొందుతున్న ఓ వలస కూలీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని ముంగిమళ్ల పంచాయతీ మడుగోని బావులకు చెందిన మడుగు పెద్ద కిష్టయ్య(34) హైదరాబాద్‌లో ఉంటూ భవన నిర్మాణ రంగంలో దినసరి అడ్డా కూలీగా పని చేస్తుండేవాడు. అతని భార్య, పిల్లలు స్వగ్రామంలోనే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటుండేవారు. కిష్టయ్య అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి భార్యాపిల్లలను చూసి వెళ్లేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. వికారాబాద్ జిల్లా పరిగి పరిధిలోని గడిసింగాపూర్ శివారులో రోడ్డు మలుపు దగ్గర టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో కిష్టయ్య కాలు, చేతులు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కొందరు అతన్ని 108లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై పరిగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న ద్విచక్రవాహనం
– ఇద్దరికి తీవ్రగాయాలు

మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమవ్వ ఆలయ సమీపంలో ఓ ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ మన్నన్ కథనం ప్రకారం.. అనంతపురం గ్రామానికి చెందిన నారాయణ, రాము కొత్తకోట మండలానికి చెందిన బాషా అనే వ్యక్తి చెందిన బోర్‌వెల్స్‌లో హెల్పర్‌గా పచేస్తున్నారు. అయితే శుక్రవారం పని నిమిత్తం కృష్ణ మండలం హిందూపూర్ వైపు వెళ్లి నల్లగట్టు దగ్గర గల మద్యం తాగి ద్విచక్రవాహనంపై బయలుదేరి మత్తులో కల్వర్టును బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నారాయణకు కాళ్లు విరిగిపోగా.. రాము తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా..

- వాహనం ఢీకొని బాలుడి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: టీ తాగడానికి రోడ్డు దాటుతున్న బాలుడిని వాహనం ఓ వాహనం ఢీ కొనడంతో మృత్యువాతపడ్డాడు. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని సోమేశ్వర కాలనీకి చెందిన సుంకన్న భార్య రాములమ్మ, తమ్ముడు మహేష్‌తో మున్సిపాలిటీలో చెత్త సేకరించే ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవా రం చెత్త సేకరణ కోసం ఆటోతో పాటు సుంకన్న చిన్న కుమారుడు చిన్నజమ్మన్న(8)ను కూడా తీసుకొచ్చారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆటోను రోడ్డు పక్కన నిలిపి న్యూటౌన్ చౌరస్తాలో ఓ టీపాయింట్ దగ్గర టీ తాగడం కోసం అందరూ కలిసి రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న టీఎస్08 యూజీ 9552 నంబర్ బొలెరో వాహనం రోడ్డు దాటుతున్న చిన్న జమ్మన్నను వేగంగా ఢీకొట్టింది. దీంతో బాలుడి తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి సుంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి


కొల్లాపూర్ పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించిన కుటుంబీకులు, పలు పార్టీల నాయకులు

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో కారు ప్రమాదంలో గురువారం రాత్రి మృతిచెందిన గనమోని శేషమ్మ(40), తీవ్ర గాయాలపాలైన సురేష్‌గౌడ్ కుటుంబీకులు, బంధువులు శుక్రవారం కొల్లాపూర్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బాధితులకు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. కొల్లాపూర్ ఎంపీపీ బోజ్యానాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ధర్నాలో కూర్చున్నారు. అనంతరం శేషమ్మ మృతదేహాన్ని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ప్రమాదానికి కారణమై కారు యజమాని హన్మంతునాయక్ ఇంటికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాలకు చెందిన పెద్దలు పోలీసుస్టేషన్ వెలుపల చర్చలు జరిపి శేషమ్మ కుటుంబానికి రూ.22 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు హన్మంతునాయక్ అంగీకరించారు. సురేష్‌గౌడ్ వైద్య ఖర్చులు చెల్లించేందుకు పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పూచీకత్తు వహించారు. ఇదిలా ఉండగా ప్రమాద సమయంలో కారులో ఉన్న హన్మంతునాయక్‌తోపాటు శంకర్‌నాయక్ అనే వ్యక్తులను అరెస్టు చేసి పోలీసులు కోర్టులో హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. కారులో ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

కిడ్నాప్ కథ ఉత్తిదే..

- రూ.15 కోట్లు వసూలు చేసిన కేసులో నేటికీ దొరకని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి
- ఇంట్లో నుంచి వెళ్లిపోయిన తమ్ముడు.. కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు భార్య ఫిర్యాదు
- ఫోన్‌కాల్ ఆధారంగా తమ్ముడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నాగర్‌కర్నూల్: అధిక వడ్డీ ఆశజూపి జిల్లాలోని కొందరి నుంచి ఓ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, అతడి సోదరుడు లక్ష్మణ్ రూ.15 కోట్లు వసూలు చేసిన ఉదంతం పాఠకులకు విదితమే. అయితే ఈ కేసుకు సంబంధించి రెండురోజుల క్రితం లక్ష్మణ్ భార్య బాధితులపైనే కిడ్నాప్ కేసు నమోదు చేయించి భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లు 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. గురువారం రాత్రి లక్ష్మణ్ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో పట్టుబడటంతో కిడ్నాప్ ఉదంతం ఉత్తిదేనని తేలింది.

తనకు తానుగా ఇంటి నుంచి వెళ్లి..

ఈ నెల 18న నాగర్‌కర్నూల్‌లో తన దుకాణంలో ఉన్న లక్ష్మణ్‌ను కొందరు బాధితులు డబ్బులు ఇవ్వాలని వత్తిడి తెచ్చారు. రెండురోజులు సమయం ఇవ్వాలని.. అన్న ఎక్కడున్నాడో తెలుసుకొని మాట్లాడతానని చెప్పడంతో బాధితుల్లో ఒకరు అతడిని ఇంటి వద్ద బైక్‌పై వదిలి వచ్చారు. మరుసటి రోజు తన భర్త కనిపించడం లేదని, కిడ్నాప్ చేశారంటూ లక్ష్మణ్ భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ డ్రామా అని నిర్ధారించుకున్న పోలీసులు లక్ష్మణ్ ఫోన్‌కాల్స్‌పై నిఘా ఉంచారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన లక్ష్మణ్ సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. రెండురోజుల తర్వాత బంధువుల ఫోన్ నుంచి భార్యతో మాట్లాడగా పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా ఎల్‌బీనగర్‌లో ఉన్నట్లు గుర్తించి గురువారం పట్టుకొని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. బంధువుల సొంత పూచీకత్తుపై అదేరోజు రాత్రి తీసుకెళ్లినట్లు సమాచారం. బాధితుల విజ్ఞప్తి మేరకు అతడిని శనివారం నాగర్‌ర్నూల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకురానున్నట్లు తెలిసింది.

కిడ్నాప్‌కు పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేయాలి


ఆందోళనకారులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

లింగాల: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు లింగాల– తెలకపల్లి ప్రధాన రహదారి మగ్దూంపూర్ దగ్గర రాస్తారోకో నిర్వహించారు. గత నెల 9న కిడ్నాప్ చేసిన యువకుడు బాలికను తిరిగి అదే నెల 20న ఇంటి దగ్గర వదిలి వెళ్లారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఈ నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా గురువారం రాత్రి బాలికను గుర్తుతెలియని వ్యక్తి మళ్లీ తీసుకువెళ్లి తెల్లవారుజామున పోలీసుస్టేషన్‌కు పంపాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. యువకుడు గణేష్‌ను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేయడం వల్లే బాలికకు భద్రత లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న లింగాల, బల్మూర్ ఎస్ఐలు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. కాగా స్టేషన్‌కు చేరుకున్న బాలిక తల్లిదండ్రుల దగ్గరకు పోవడానికి అంగీకరించకపోవడంతో పోలీసులు స్టేట్ హోంకు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలిక కిడ్నాప్ వ్యవహారంలో యువకుడిపై కేసు నమోదు చేశామని, త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

రామన్‌పాడుకు నీటి సరఫరా నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శుక్రవారం పూర్తి నీటి మట్టం 1,017 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి పేర్కొన్నారు.

నల్లమలలో మట్టిదందా

అనుమతి లేకుండానే కుంటలు, చెరువుల్లో తవ్వకాలు

- కళ్ల ముందే కనుమరుగవుతున్న గుట్టలు
- రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ముఖ్య నాయకుల అండదండలతో చెలరేగుతున్న మాఫియా
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు


ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న జేసీబీ

అచ్చంపేట రూరల్: నల్లమలలో అక్రమ మట్టి తవ్వకాల దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులు, కుంటలు, గుట్టలు, శిఖం భూముల్లో జేసీబీల సాయంతో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్, టిప్పర్ల సాయంతో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ముఖ్య నాయకుల అండదండలతో నల్లమలలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. అయితే ఇందుకు కొందరు అధికారులు సైతం లోపాయికారీగా సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల మేరకు చెరువులు, కుంటలు, శిఖం భూముల్లో మట్టి తవ్వకాలను నీటి పారుదల, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండా జరపకూడదు. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు, కుంటలు, శిఖం భూముల్లో మట్టిని తవ్వేస్తున్నారు.

పులిజాల గీరాయికుంటలో..

అచ్చంపేట మండలం పులిజాల శివారులోని గీరాయి కుంటలో గత రెండేళ్లుగా అక్రమంగా జేసీబీల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో అచ్చంపేటకు తరలిస్తున్నారు. ప్రతిరోజు వందల ట్రిప్పులను అచ్చంపేటకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కుంటలో పెద్ద పెద్ద గోతులు తవ్వడంతో ప్రమాదకరంగా మారాయి. మట్టిని ఎంత తవ్వారో ఆనవాళ్లు, గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అచ్చంపేటకు ట్రాక్టర్ మట్టిని తరలిస్తే రూ.800–1,200ల వరకు వసూలు చేస్తున్నారు. దూరాన్ని, మట్టి నాణ్యతను బట్టి డబ్బులు దండుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ సాయంతో కుంటలు, చెరువులు, శిఖం భూముల్లో తవ్వకాలు జరపొద్దు. నిబంధనలు ఉలంఘించే వారిని ఏమాత్రం ఉపేక్షించం. పులిజాల గీరాయికుంటలో అక్రమంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణయ్య, తహసీల్దార్, అచ్చంపేట

ధ్వంసమవుతున్న ఆనకట్ట..

నిత్యం భారీ లోడుతో వందలాది ట్రిప్పులను తరలిస్తున్న ట్రాక్టర్లతో ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది. ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. ఆనకట్టపై భారీగా ట్రాక్టర్లు తరలడంతో కుంగిపోతుంది. ట్రాక్టర్లు, జేసీబీలు గీరాయికుంటలోకి కట్టపై నుంచి కిందకు దిగే సమయంలో టైర్ల రాపిడితో కట్ట మట్టి మొత్తం కొట్టుకపోయి చిన్నగా మారిపోయింది. ఒకవేళ భారీ వర్షాలు కురిసి పెద్దమొత్తంలో కుంటలోకి నీరు వస్తే పెద్ద నష్టమే జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు విషయం చెబుదామంటే అక్రమార్కులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇన్నేళ్లుగా తతంగం నడుస్తున్నా ఏం చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలు అచ్చంపేట నియోజకవర్గంలో చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రతిరోజు రూ.లక్షల్లో వ్యాపారం సాగుతుంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సామాన్య రైతులు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


మట్టి తరలింపుతో గీరాయికుంటలో ఏర్పడిన గుంతలు

క్లుప్తంగా...

'పోడు' పంపిణీ వాయిదా?

తొలుత ఈ నెల 24 నుంచే ఇస్తామన్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు పట్టాల పంపిణీలో జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 24 నుంచే జిల్లాల్లో సభలు నిర్వ హించి లబ్ధిదారులకు అందజేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ దిశగా జిల్లాల్లో ఎ లాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ కార్యక్రజుమం వాయిదా పడినట్లు కనిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం శనివారం సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లాలో పర్యటించి కొత్త కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించాల్సి ఉంది. అక్కడే బహిరంగ సభలో పోడు పట్టాలను పంపిణీ చేయాలి. ఇదే సమయంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కావలసి ఉంది. జిల్లాల్లో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై సమావేశాలు ఉండడంతో అటు పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్లు హైదరాబాద్‌లోనే ఉన్నారు. దీంతో పోడు పట్టాల పంపిణీ ముందుగా ప్రకటించినట్లు కాకుండా.. మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర మంది గిరిజన లబ్ధిదారులకు 4 లక్షల ఎకరాల(ఆర్వోఎఫ్ఆర్) అటవీ భూములపై హక్కులు కల్పించి, ఈ సీ జన్ నుంచే రైతుబంధు వర్తింపజేయాలని ప్రణాళిక రూపొందించారు. పట్టాలు ఇవ్వడంలోనే ఆలస్యం అవుతుండడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల సేకరణ, రైతుబంధు జమ ఈ సీజన్‌లోనే జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ నెల 26 నుంచే రైతుబంధు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

శేజల్‌తో బీఆర్ఎస్ నేతల చర్చలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లైంగికంగా వేధించి, తమపై కేసులు పెట్టించారని గత రెండు నెలలు నుంచి పలు రకాలుగా ఆందోళన చేస్తున్న ఆరిజన్ నిర్వాహకురాలు శేజల్‌తో బీఆర్ఎస్ ఎంపీలు శుక్రవారం చర్చలు జరిపారు. బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్‌లు శేజల్, ఆదినారాయణలతో సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ప్రభుత్వ భూమి కొనుగోలు చేసిన డబ్బులు వాపస్, తమపై ఉన్న కేసుల ఎత్తివేత, ఎమ్మెల్యే చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఇందుకు తప్పు చేసిన వారిపై పార్టీలో క్రమశిక్షణ చర్యలుంటాయని, అలాగే ఆమెకు న్యాయం చేస్తామని నాయకులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

త్వరలో 'వైద్య' ఫీజుల పెంపు!

- కాలేజీలవారీగా ఫీజుల సవరణకు కసరత్తు చేసిన టీఏఎఫ్ఆర్సీ
- ధరలు పెరిగినందున ఫీజులు పెంచాలని యాజమాన్యాల విన్నపం
- ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పెంపునకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ తదితర వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కసరత్తు పూర్తి చేసింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఫీజులను సవరించనుంది. ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర కోర్సుల ఫీజులను మూడేళ్లకోసారి సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఏడాదికోసారి 5 శాతం చొప్పున సవరించాలన్న నిర్ణయాన్ని మార్పు చేశారు. ఆ ప్రకారం ఈసారి తప్పనిసరిగా ఫీజుల సవరణ జరుగుతుందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు రూ. లక్షల్లో ఉండగా త్వరలో అంతకు మించి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఒక్కో మెడికల్ కాలేజీకి ఒక్కో ఫీజు...

ఇప్పటివరకు రాష్ట్రంలో మెడికల్ కోర్సుల ఫీజులు ఒకే రీతిన ఉన్నాయి. ఇకపై ఒక్కో కాలేజీలో ఒక్కో రకమైన ఫీజు ఉండనుంది. ఆ ప్రకారమే ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర వైద్య కోర్సుల ఫీజులుంటాయి. అందుకు అనుగుణంగానే కాలేజీలవారీగా ఆడిట్ రిపోర్టులను టీఏఎఫ్ఆర్సీ తీసుకుంది. వాటి ఆధారంగానే ఫీజుల సవరణ చేయనుంది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ తదితర పూర్తిస్థాయి సమాచారం సేకరించారు. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒక రకంగా ఉంటే పట్టణ ప్రాంతాల్లోని కాలేజీల్లో మరో రకంగా ఉంటాయి. ఈ దిశగా కాలేజీవారీగా ఆడిట్ నివేదికలు పరిశీలించిన టీఏఎఫ్ఆర్సీ ఫీజుల సవరణపై ఒక అంచనాకు వచ్చింది. కాలేజీలవారీగా ఫీజుల పెంపు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. దీంతో ఫీజుల పెంపు వ్యవహారంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ధరలు పెరిగినందున ఆ మేరకు ఫీజులు పెంచాలని యాజమాన్యాలు ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి.

కొన్ని కాలేజీల్లో 20 శాతం వరకు పెరిగే అవకాశం...

ప్రస్తుతమున్న ఫీజులను కొన్ని కాలేజీలు 20 శాతం వరకు పెంచాలని కోరగా మరికొన్ని 10 శాతం, కొన్ని 5 శాతం, ఇంకొన్ని యథాతథంగా ఉంచాలని కోరినట్లు సమాచారం. ప్రైవేటు కాలేజీల్లో ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి ఏ-కేటగిరీ (కన్వీనర్) ఫీజు రూ. 60 వేలు ఉండగా బీ-కేటగిరీ ఫీజు రూ. 11.55 లక్షలుగా ఉంది. ఇక సీ-కేటగిరీ (ఎన్ఆర్ఐ) అడ్మిషన్ ఫీజు బీ-కేటగిరీకి రెట్టింపు అంటే రూ. 23.10 లక్షల వరకు వసూలు చేసుకొనే వీలుంది. ఇక పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏ-కేటగిరీ ఫీజు రూ. 7.5 లక్షలు, బీ-కేటగిరీ రూ. 28 లక్షల నుంచి రూ. 30 లక్షల చొప్పున ఉన్నాయి. బీడీఎస్ కోర్సులకు సంబంధించి ఏ-కేటగిరీ ఫీజు రూ. 45 వేలు ఉండగా బీ-కేటగిరీ ఫీజు రూ. 4.2 లక్షలు, ఇక సీ-కేటగిరీ ఫీజు బీ-కేటగిరీ కంటే రెట్టింపు వసూలు చేసుకోవచ్చు. వాటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీలవారీగా భిన్నంగా ఉన్నాయి.

కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులేవి?

గత ఏడాది వరదలకు కొట్టుకుపోయిన గేట్ల ముందు కాంక్రీటు దిమ్మెలు

- మరమ్మతులు చేయడంలో ఇరిగేషన్ శాఖ జాప్యంపై విమర్శలు
- ఈ సీజన్‌లో మళ్లీ భారీ వర్షాలు వస్తే కోతకు గురయ్యే అవకాశం
- గేట్లకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు



అన్నారంలోని సరస్వతి బ్యారేజీ వద్ద కొట్టుకుపోయిన కాంక్రీటు దిమ్మెలు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లింకు-1 బ్యారేజీల వద్ద గత ఏడాది వచ్చిన భారీ వరదలతో కాంక్రీటు దెబ్బతింది. అయితే మళ్లీ వానాకాలం వచ్చినప్పటికీ దెబ్బతిన్న చోట్ల ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ, అన్నారంలోని (సరస్వతి) బ్యారేజీల వద్ద వరద తాకిడికి గేట్ల ముందు భాగంలోని కాంక్రీటు దిమ్మెలు కొట్టుకుపోయాయి. గత సీజన్‌లో ఇది జరిగితే ఇప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు మరమ్మతుల విషయంలో ఆలోచన చేయడం లేదని, ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్నా పనుల్లో జాప్యం చేస్తున్నారని నీటిపారుదల రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

గతేదాది ఉధృతంగా వరద

గత ఏడాది కురిసిన భారీవర్షాలకు బ్యారేజీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఎగువ గోదావరి నుంచి సరస్వతీ బ్యారేజీ వద్ద 17.50 లక్షల క్యూసెక్కుల వరద జూలై 14–15 తేదీల్లో ఉధృతంగా ప్రవహించింది. దీంతో బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరద ఉధృతికి గేట్ల కింది భాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మెలు లేచిపోయాయి. అలాగే గోదావరి వరదకు, ప్రాణహిత వరద తోడై మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వద్ద 29 లక్షల క్యూసెక్కులకుపైగా వరద రావడంతో దిమ్మెలు చెల్లాచెదురుగా కొట్టుకుపోయాయి.

కాంక్రీటు దిమ్మెలు ఇలా..

బ్యారేజీల్లో గేట్లు ఎత్తినప్పుడు వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ముందు భాగంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు అత్యాధునిక టెక్నాలజీతో కాంక్రీటు దిమ్మెలను అమర్చారు. 3 అడుగుల వెడల్పు, పొడవుతో దిమ్మెలను బ్యారేజీ పొడవునా గేట్ల కింద ముందు భాగంలో కాంక్రీటు చేశారు. వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ఈ దిమ్మెలు అడ్డుకుంటాయి. కానీ గత ఏడాది వచ్చిన భారీ వరద తాకిడికి ఈ దిమ్మెలు విరిగి ఎక్కడికక్కడ చెల్లాచెదురుగా పడి కొట్టుకుపోయాయి. అప్పటి నుంచీ అక్కడ మరమ్మతులు చేయలేదని చెబుతున్నారు.

డిజైన్స్ రాలేదని..

మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం (సరస్వతి) బ్యారేజీల వద్ద అమర్చిన దిమ్మెలు కొట్టుకుపోయి ఏడాది కావస్తున్నా.. డిజైన్స్ తయారు చేయలేదని ఇంజనీరింగ్ శాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేయకుండానే మళ్లీ వర్షాకాలం ఆరంభమైంది. వర్షాలు ఏకధాటిగా కురిస్తే మరోసారి భారీ వరదలు వచ్చే అవకాశం ఉంది. బ్యారేజీల గేట్లు ఎత్తితే మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఇప్పటికే గేట్ల ముందుభాగంలో కోతకు గురై, భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతో గేట్లకు కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అంటున్నారు.

మోడల్ స్టడీ చేయాలి

గేట్ల ముందు భాగంలో కాంక్రీటు దిమ్మెలు లేచింది వాస్తవమే. కానీ డిజైన్స్ తయారు చేయాలి. దీనిపై ప్రొఫెసర్లు అధ్యయనం చేయాల్సి ఉంది. వారు మోడల్ స్టడీ చేయాలి. తరువాతనే మరమ్మతులు చేస్తారు. పలుమార్లు ఇరిగేషన్ శాఖ తరఫున ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. డిజైన్స్ తయారీకి కొంత సమయం పడుతుంది.

– యాదగిరి, ఈఈ, అన్నారం బ్యారేజీ

ఇన్విజిలేటర్ కొట్టాడని విద్యార్థి బలవన్మరణం

- మృతదేహంతో కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా
- కొట్టలేదన్న కాలేజీ యాజమాన్యం



మృతదేహంతో కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట రూరల్: పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేస్తుండగా ఇన్విజిలేటర్ మందలించి, చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లాలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేటకు చెందిన భూక్యా ఈర్య–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు భూక్య సాయికుమార్ (23) నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బ్యాక్‌లాగ్‌లు ఉండడంతో అదే పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సెంటర్‌లో సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నాడు. గురువారం పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో గమనించిన ఇన్విజిలేటర్.. సాయికుమార్‌ను మందలించి కొట్టాడు. దీంతో మనోవేదనకు గురై, రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికుమార్ మృతికి ఇన్విజిలేటర్, యాజమాన్యం కారణమంటూ కుటుంబ సభ్యులు.. మృతదేహంతో కాలేజీ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేపట్టారు. ఉద్రిక్తత నెలకొనడంతో కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులతో మాట్లాడిన నర్సంపేట సీఐ పులి రమేష్‌గౌడ్.. మృతదేహాన్ని గ్రామానికి పంపించారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్‌ను వివరణ కోరగా... సాయి కుమార్ అనే విద్యార్థి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌తోపాటు బుక్‌లెట్‌ను దొంగతనం చేయడానికి ప్రయత్నించాడని, గుర్తించిన ఇన్విజిలేటర్ మందలించి, తమ వద్దకు తీసుకొచ్చారని తెలిపారు. విద్యార్థి రిక్వెస్ట్‌తో పరీక్ష రాసేందుకు అనుమతించామే తప్ప.. ఎవరూ కొట్టలేదన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా

అక్టోబర్ 1 తర్వాత నిర్వహించుకోవచ్చని హైకోర్టు సూచన

గోదావరిఖని (రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు నాలుగు నెలల గడువు కావాలని సింగరేణి గనులు విస్తరించి ఉన్న జిల్లాల కలెక్టర్లు కోర దంతో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవా రం సింగరేణి ఎన్నికలపై హైకోర్టులో విచారణ జరి గింది. వాదనలు విన్న తర్వాత హైకోర్టు అక్టోబర్ 1 తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం హైదరా బాద్‌లో జరగనున్న ఆర్ఎల్‌సీ సమావేశం వాయిదాపడింది. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలప రిమితి నాలుగేళ్లు ఉండాలని కోరుతూ టీబీజీకేఎస్ కూడా హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో హైకోర్టు సింగరేణి యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి ఎన్నికలకు ఏర్పాట్లు చేయలేమని ప్రభుత్వ యంత్రాంగం కూడా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

మరో ఏడాది వాయిదా పడే అవకాశం

అక్టోబర్ తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కోర్టు సూచించిన నేపథ్యంలో ఎన్నికలు మరో ఏడాది వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అక్టోబర్‌లో సాధారణ ఎన్నికల బిజీలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో జనవరి వరకు సింగరేణి ఎన్నికలు నిర్వహించే వీలుండదని కొందరు చెబుతున్నారు.

ధాన్యానికి రికార్డుస్థాయి ధర రూ. 2,911

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర రూ.2,911 పలికింది. మార్కెట్‌లో ధాన్యం సీజన్ మొదలైనప్పటి నుంచి ఇంత ధర రావడంఇదే మొదటిసారి. గూడూరు మండలం అప్పరాజుపల్లికి చెందిన మనోజ్‌కుమార్ అనే రైతు మార్కెట్‌కు 6 బస్తాల ధాన్యం (ఆర్ఎన్ఆర్ పాతరకం) అమ్మకానికి తీసుకురాగా, క్వింటాకు రూ.2,911 చెల్లించారు. మద్దతు ధర రూ.2,060 ఉండగా, మద్దతుకు మించే ధర రావడం విశేషం. శుక్రవారం మార్కెట్‌కు 1,182 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.2,911 పలకగా, కనిష్ట ధర రూ.1,809 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ..

కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



పురుగుమందు డబ్బా లాక్కొంటున్న పోలీసు

గద్వాల రూరల్: తన పొలానికి దారి వదలమని అడిగితే ఇవ్వకుండా పక్కపొలం వారు పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ రైతు తన కుటుంబంతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం కలెక్టరేట్ వద్ద చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం ఇర్కిచేడుకు చెందిన పెద్ద జయన్నకు 6.20 ఎకరాల పొలం ఉంది. భాగ పరిష్కారం విషయంలో బంధువులతో వివాదం కొనసాగుతుంది. సర్వే చేయించి తనకు రావాల్సిన భాగాన్ని ఇవ్వాలని కోరగా.. పోలీసులు అన్యాయంగా తనతో పాటు భార్య, పిల్లలను కూడా స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరించారని శుక్రవారం కలెక్టరేట్ వద్ద అదనపు కలెక్టర్ వాహనం ముందు కూర్చుని పురుగుమందు తాగేందుకు యత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు మందు డబ్బాను లాక్కొని కలెక్టరేట్ ఏఓ వద్దకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేష్ వద్ద ప్రస్తావించగా.. పెద్ద జయన్నపై గతంలో కేసులు ఉన్నాయని.. విచారించేందుకు స్టేషన్‌కు పిలిపించామన్నారు. ఎలాంటి దౌర్జన్యానికి పాల్పడ లేదని సమాధానమిచ్చారు.

జేపీఎన్‌సీలో ముగిసిన వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రోబో టెక్నాలజీ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ మేరకు ముగింపు కార్యక్రమంలో ఐఐటీడీఎం కర్నూలు డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లలో పాల్గొడం వల్ల చాలా అవగాహన పెరుగుతుందని, వారి నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. కర్నూలు ఐఐటీడీఎం ఆధ్వర్యంలో జేపీఎన్‌సీకి సాంకేతిక సహకారం అందించేందుకు అవగాహర ఒప్పందం కుదుర్చుకున్నారు. 120 విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, సహదేవ్, ప్రిన్సిపాల్ సుజీవన్, ప్రొఫెసర్ సత్యబాబు, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బడుగులకు రాజ్యాధికారం

- నాగర్‌కర్నూల్‌లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్
- నడ్డా బహిరంగసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బహిరంగసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలంటే బీజేపీతోనే సాధ్యపడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన కొనసాగుతోందని చెప్పారు. ఈ దుర్మార్గపు పాలనపోయి రామరాజ్యం రావాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ ప్రధానిగా మోదీ నిలిచారని చెప్పారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం కింద తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధితో పాటు రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను ప్రజలకు చెప్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో మూడు సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జేపీ నడ్డా బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 25న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారని చెప్పారు. ఈ సభను విజయవంతం చేసేందుకు వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. 'నవ సంకల్ప యాత్ర' పేరుతో నిర్వహించనున్న బహిరంగ సభ వాల్‌పోస్టర్లను పార్టీ నేతలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం సభాప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీపాచారి, అధికార ప్రతినిధి మాధవి, కోశాధికారి శాంతకుమార్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, కొండ మనెమ్మ, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఓర్వలేకనే అభాసుపాలు చేస్తున్నారు

- ఆరోపణలపై ఈడీ, లోకాయుక్తతో విచారణకు సిద్ధం
- పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఎలాంటి అవకతవకలు జరగలేదని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో తనపై కొందరు చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న తనను ఓర్వలేకనే అభాసు పాలు చేస్తున్నారని, ఈ మట్టిలో పుట్టి.. ఈ నేలపై పెరిగి సీఎం కేసీఆర్, స్థానిక మంత్రి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నానన్నారు. తాను యూనివర్సిటీకి వీసీగా వచ్చినప్పుడు 152 మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం 153 మంది ఉన్నారని.. ఆ ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చామన్నారు. బీఎడ్ కళాశాలలకు గుర్తింపు ఎన్సీఈసీ నిబంధనల ప్రకారం, మార్గదర్శకాలను అనుసరించి అఫ్లియేషన్ ఇచ్చామని, ఓయూ నుంచి డీన్, విషయ నిపుణులు వచ్చి తనిఖీలు చేస్తారన్నారు. బోధనేతర సిబ్బంది ఇంక్రిమెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆక్షేపణ మేరకు ఆపామని, ఈసీలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికపరమైన అనుమతుల కోసం తీర్మానించారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చిన వెంటనే వేతనాలు పెరుగుతాయన్నారు. లైబ్రరీలో పోయిన పుస్తకాలు రికవరీకి ఆదేశించామని, అయితే రూ.10 లక్షలు పోయాయన్నది అవాస్తవం అన్నారు. లైబ్రరీ ఆటోమేషన్ అవాస్తవమని, బాలికల హాస్టల్ నిర్మాణానికి సంబంధించి అక్కడ ఉన్న పరిస్థితుల ఆధారంగా, గతంలో ఉన్న వ్యయంలోనే జీప్లస్ 2 కాకుండా మరో అంతస్తు అదే వ్యయంలో నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తిగా ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జరిగిందని, ప్రభుత్వం ఐటీ డిపార్ట్‌మెంట్ ఆధారంగా పారదర్శకంగా చేపట్టామన్నారు. హాస్టల్ టెండర్‌దారులు నాణ్యమైన సరుకులు సరఫరా చేయనందుకు విద్యార్థులను ఇబ్బంది పెడితే, వారి టెండర్‌లను నిలిపివేసి విద్యార్థులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని సూచించామని చెప్పారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఈడీ, లోకాయుక్తతో విచారణకు అయినా సిద్ధమేనని ప్రకటించారు.

వలసలు తగ్గితే చూపించండి



మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రచారం చేస్తున్న డీకే అరుణ, బీజేపీ నాయకులు

- స్వరాష్ట్రంలో పాలమూరుకు ఒరిగిందేమీ లేదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో ఎక్కడ వలసలు తగ్గాయో సీఎం కేసీఆర్, కేటీఆర్ వచ్చి బీజేపీ నేతల సమక్షంలో స్థానిక బస్టాండ్‌లో చూపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సవాల్ విసిరారు. జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శుక్రవారం పట్టణంలోని క్లాక్‌టవర్, సుల్తాన్ బజార్, పుట్నాల బట్టి, పాన్ చౌరస్తా ఏరియాలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పాలమూరు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. 9ఏళ్ల కాలంలో ఉమ్మడి పాలమూరులో ప్రాజెక్టులు పూర్తి కాలేదని, కనీసం కోయిల్‌సాగర్ కాల్వలు ఆధునీకరించలేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరితో ఉందని, జూరాల నుంచి నీళ్లు రాకుండా శ్రీశైలం బ్యాక్‌వాటర్ పేరుతో డిజైన్లు ఎందుకు మార్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఏదైనా జరిగింది అంటే కేవలం కేంద్రం ఇచ్చిన నిధుల ద్వారానే అని తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి రూ.163కోట్లు, రైల్వే స్టేషన్ ఆధునీకీకరణకు రూ.17కోట్లు, చించోళి రోడ్డు నిర్మాణానికి రూ.700కోట్లు, జడ్చర్ల నుంచి రాయచూర్ జాతీయ రహదారికి రూ.239కోట్లు, మయూరీ పార్క్ కోసం కంపా నిధుల ద్వారా రూ.120కోట్లు నిధులు కేంద్రం కేటాయించిందన్నారు. కేంద్ర నిధులతో అభివృద్ధి చేసిన వాటికి పేర్లు మార్పు చేయడం సిగ్గుమాలినతనమన్నారు. మోదీ 9ఏళ్ల సుపారిపాలనపై జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మే 30నుంచి జులై 5వరకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజెబుతున్నట్లు చెప్పారు. ప్రపంచ దేశాలు మోడీ వైపు చూస్తున్నాయని, కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతినకుండా కాపాడిన వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, ఎన్.పీ వెంకటేష్, అంజయ్య, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు సహకార రుణాలు

- మొండి బకాయిల వసూళ్లకు చర్యలు
- మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు సకాలంలో సహకార బ్యాంకు రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు అపెక్స్ బ్యాంకుతో చర్చించి తగిన విధంగా సమకూరుస్తామని డీసీసీబీ చైర్మన్ నిజాం పాషా అన్నారు. సింగిల్‌విండో చైర్మన్లు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిజాంపాషా మొట్టమొదటి సారిగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన మహాజన సభలో పాల్గొన్నారు. 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 103వ వార్షిక నివేదిక, ఆడిట్ పట్టిక, ఆడిట్ చేయబడిన ఆస్తి, అప్పుల పట్టిక, లాభనష్టాల పట్టికను సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ఇందుకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన మహాజన సభలో చైర్మన్ మాట్లాడుతూ 2022- 23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నికర లాభం రూ.670.16 లక్షలు సాధించిందన్నారు. బ్యాంకు రుణాల మంజూరు రికార్డు స్థాయిలో రూ.58,909.24 లక్షల స్వల్పకాలిక పంట రుణాలు, రూ.5,816.72 లక్షల దీర్ఘకాలిక రుణాలు బట్వాడా చేయడం జరిగిందన్నారు. బంగారు ఆభరణాల తాకట్టుపై రూ.13,585.99 లక్షలు ఇచ్చామన్నారు. 2023 మార్చి 31 నాటికి రుణాల వసూళ్లు 73 శాతం ఉందని, నిరర్ధక ఆస్తులను 11.15 శాతం నుంచి 7.36 శాతానికి తగ్గించామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటయ్య, సీఈఓ లక్ష్మయ్య, డైరెక్టర్లు మంజులారెడ్డి, బక్కన్నయాదవ్, రంగారెడ్డి, భీంరెడ్డి, భూపాల్‌రావు, లక్ష్మీనారాయణ, నర్సింహులు, చంద్రనాయక్, బ్యాంకు జనరల్ మేనేజర్ వెంకటేష్, కోదండరాములు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు సమాచారం ఇవ్వకుండా..

రైతుల సేవలో ఉండాల్సిన డీసీసీబీ అధికారులు, పాలకులు సహకార బ్యాంకులు, రైతులకు మధ్య రుణాల మంజూరు, రికవరీ విషయంలో పారదర్శకత పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకే ఒక్క డీసీసీబీ మహబూబ్‌నగర్‌లో ఉండటం, అక్కడక్కడ కొన్ని సొసైటీలలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం కావడం, కేసులు విచారణ పేరిట కాలయాపన జరుగుతుండటం తెలిసిందే. అయితే డీసీసీబీ పాలకుల్లో కొందరు తమ తమ ప్రాంతాలకు పెద్దఎత్తున నిధులు తీసుకెళ్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహాజన సభలో నిరుత్సాహంగా ఉన్న సింగిల్‌విండో చైర్మన్లు, డైరెక్టర్లు గళం విప్పుతారనే దూరదృష్టితో ఆలోచించి మీడియాకు సమాచారం ఇవ్వకుండానే మహాజన సభ ముగించారు. ఆ తర్వాత పత్రికా ప్రకటన ద్వారా మహాజన సభ వివరాలు తెలిపారు. మహాజన సభ గోప్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపు పాలమూరు కోఆపరేటివ్ బ్యాంక్ సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 25వ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సీఈఓ దోమ దశరథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బ్యాంక్ చైర్మన్ జి.కృష్ణయ్య అధ్యక్షతన సమావేశం ఉంటుందని, వాటాదారులు, ప్రమోటర్లు, డైరెక్టర్లు విధిగా హాజరుకావాలని కోరారు. ఇదివరకే ఈ సర్వసభ్య సమావేశం ఎజెండాను వాటాదారులందరికీ పోస్ట్‌ద్వారా పంపించినట్లు తెలిపారు.